విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



గండిగూడలో విద్యార్థులతో దాత, నాయకులు

శంషాబాద్ రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దాతల సహాయంతో మంగళవారం బ్యాగులు, నోటు పుస్తకాలు, స్టేషనరీ సామాగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. సత్య సుందర హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘాన్సిమియాగూడ, గండిగూడ, పాల్మాకుల, పెద్దషాపూర్ పాఠశాల విద్యార్థులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకులు సాహిల్‌సింగ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి మహేందర్, ఉపాధ్యక్షుడు కోటేష్‌గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కాముని చెరువును పరిశీలించిన డీసీపీ



చెరువు వద్ద అధికారులతో చర్చిస్తున్న డీసీపీ రాజేష్

శంషాబాద్: రాబోయే వినాయక చవితిని పురస్కరించుకుని పట్టణంలోని నిమజ్జనానికి వినియోగించే కాముని చెరువును శంషాబాద్ డీసీపీ రాజేష్ పరిశీలించారు. చెరువులో నిమజ్జనం నిర్వహించనున్న ప్రాంతంలో ఏర్పాట్లు తదితర విషయాలను మున్సిపాలిటీ ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ అధికారులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ బి. సుమన్‌రావుతో పాటు ఇరిగేషన్, రెవిన్యూ సంబంధిత విభాగాల అధికారులతో పూర్తి వివరాలు తెలుసుకుని పలుసూచనలు చేశారు.

చదువులో రాణించాలి



విద్యార్థులకు బస్ పాస్‌లను అందించిన వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

మణికొండ: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 300 మంది విద్యార్థులకు మంగళవారం మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి తన స్వంత డబ్బుతో ఆర్టీసీ బస్‌పాస్‌లను మంజూరు చేయించి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో అవసరమైన అన్ని రకాల మౌళిక సదుపాయాలను కల్పిస్తున్నామని, విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నిరంజన్, హెచ్‌సీయు డిపో సూపరెండెంట్ లక్ష్మి, మధు, బాబురావు, రవి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు బీరప్ప, మాజీ ఎంపీటీసీ ఎం. రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



విరాళం అందించిన భక్తుడు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీ చిదంబరేశ్వర భక్త సమాజం ఆధ్వర్యంలో పునర్నిర్మాణం చేయనున్న చారిత్రాత్మకమైన శివాలయం, సీతారామాంజనేయ ఆలయ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన భక్తుడు సురేష్ చారి మంగళవారం రూ. లక్ష విరాళం అందజేశారు. దేవాలయ కమిటీ చైర్మన్, కౌన్సిలర్ జి.వెంకటేశ్‌యాదవ్‌కు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కె.రవీందర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్‌లతో గ్రామస్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మైలార్‌దేవ్‌పల్లి: ఇరువైఏళ్ల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మైలార్‌దేవ్‌పల్లిలోని ప్రగతి భవన్‌లో కల్లెం లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఒకరినిఒకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఈ నేపథ్యంలో పూర్వ గురువులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

తడి-పొడి చెత్తను వేరు చేసి సేకరించాలి



బండ్లగూడ: కార్పొరేషన్ పరిధిలోని 1,2,5వ డివిజన్‌లలోని హిమగిరి నగర్ కాలనీ, జేఎన్ఎన్‌యూఆర్ఎం ఫేజ్-2 ప్రగతి హోమ్స్‌లలో చెత్త సేకరణను మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తడి, పొడి చెత్త సేకరణను వేరు వేరుగా తీసుకోవాలని, వేరు చేసిన తడి చెత్తను కంపోస్ట్‌గా మార్చాలన్నారు. ప్రజలు చెత్తను రోడ్లపై వేయవద్దని, ప్రతి రోజు ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు రామాంజులు, కృష్ణ, నరేందర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలోనూ

నీటి కష్టాలు!

- నిలిచిపోయిన మిషన్ భగీరథ సరఫరా
- అడుగంటుతోన్న భూగర్భ జలాలు
- ఎండిపోతున్న బోర్లు



ప్రైయివేటు ట్యాంకరుతో ఓ ఇంటి వద్ద నీటిని నింపుకుంటున్న దృశ్యం

శంషాబాద్ రూరల్: సాధారణంగా నీటి కష్టాలు వేసవిలో వస్తుంటాయి. కానీ.. మండలంలో వర్షాకాలంలోనూ నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోగా.. భూగర్భ నీటి మట్టాలు తగ్గిపోయి బోర్ల నుంచి సరఫరాకు సైతం ఇబ్బందులు తప్పడంలేదు. దీంతో మండలంలోని ఆయా గ్రామాల్లో తాగునీటికి జనాలు అవస్థలు పడుతున్నారు. ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా నీళ్లు కొనుకునే పరిస్థితి నెలకొంది. మండల పరిధిలో ఉన్న గ్రామాలకు సరఫరా అవుతున్న మిషన్ భగీరథ నీళ్లు సుమారు పది రోజులుగా రావడం లేదు. మరమ్మతుల కారణంగా నీటి సరఫరా నిలిచిపోగా.. గ్రామాల్లో నీటి ఎద్దడి ఎదురవుతోంది. కొన్ని గ్రామాలకు పూర్తిగా నీటి సరఫరా లేకపోగా.. మరి కొన్ని గ్రామాలకు అరకొరగా వస్తున్నాయి. గ్రామాల్లో సైతం పైపు లైన్ లీకేజీల కారణంగా సమస్య మరింత పెరుగుతుంది. భగీరథ నీటి సరఫరా లేకపోవడంతో గ్రామాల్లో బోర్ల నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు.



కాలిపోయిన బోరు మోటారును మరమ్మతుల కోసం తీస్తున్న దృశ్యం

ఎండిపోతున్న బోర్లు..

వర్షాలు సరిగా లేక రోజు రోజుకు భూగర్భ జలాలు అడుగంటి బోర్లు ఎండిపోతున్నాయి. మిషన్ భగీరథ నీటి సరఫరా ఆగిపోవడంతో గ్రామాల్లో ప్రత్యామ్నాయంగా బోరు నీరు సరఫరా చేపట్టారు. అయితే గ్రామాల్లో బోర్లలో నీరు చాలా వరకు ఎండిపోయాయి. అందుబాటులో ఉన్న బోర్లలో నీటి మట్టాలు తగ్గి ఇబ్బందులు తప్పడంలేదు. మరో వైపు బోర్లలో నీళ్లు లేక తరచూ బోరు కాలిపోయి మరమ్మతులు చేయాల్సి వస్తుంది. ఇందుకు సరిపడ్డా నిధులు పంచాయతీల్లో లేక మరమ్మతులకు జాప్యం జరుగుతోంది.

త్వరలో పరిష్కారం అవుతుంది..

మరమ్మతుల కారణంగా మిషన్ భగీరథ నీటి సరఫరా ఆగిపోయింది. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుంది. యథావిధిగా నీటి సరఫరా జరుగుతుంది. గ్రామాల్లో బోర్ల ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నాం.

- శివకుమార్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

నీటి ఎద్దడి గ్రామాలు..

మండలంలో రామంజాపూర్, మల్కారం, ననాజీపూర్, సుల్తాన్‌పల్లి, కాచారం, జూకల్, పిల్లోనగూడ, పాల్మాకుల, తదితర గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొంది. ఆయా గ్రామాల్లో ఉన్న బోర్లలో నీటి మట్టాలు తగ్గిపోవడంతో పూర్తి స్థాయిలో నీటి సరఫరా కావడంలేదు. రామంజాపూర్‌లో మూడు బోర్లు ఉండగా.. ఇక్కడ కేవలం ఒక బోరు మాత్రమే పని చేస్తుంది. ఇందులో కూడా నీటి మట్టం తగ్గి తరచూ మోటారు కాలిపోతుంది. బోటిగూడలో రెండు బోర్లు ఉండగా.. రోజు మార్చి రోజు నీటి సరఫరా చేస్తున్నారు. రామంజాపూర్ పంచాయతీలో బోరు మోటార్ల మరమ్మతుల కోసం చెల్లించాల్సిన రూ.2లక్షల బిల్లులు బకాయి ఉన్నాయి. దీంతో మోటార్ల మరమ్మతుల కోసం మెకానిక్‌ల కాళ్లవేళ్ల పడి పనులు చేయించుకోవాల్సి వస్తుందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మల్కారంలో ఒకే బోరు పని చేస్తుండగా.. ఈ నీటితోనే నెట్టుకొస్తున్నారు.

వీధి నల్లాలు లేక..

మిషన్ భగీరథ పథకంతో ఇంటింటికి నల్లా కనెక్షన్లు ఏర్పాటు చేశారు. గతంలో గ్రామాల్లో ఉన్న వీధి నల్లాలు, మినీ ట్యాంకులు తొలగించారు. అక్కడక్కడ గ్రామాల్లో సింగిల్ ఫేజ్ మోటార్లు నడిచేవి. ప్రస్తుతం వీటిని తీసేయడంతో బోర్ల నుంచి నీటిని ఓవర్‌హెడ్ ట్యాంకర్లతో ఇంటింటికి సరఫరా చేయడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాలా చోట్ల ఎత్తు, పల్లాల కారణంగా సరిగా నీటి సరఫరా కావడంలేదు. వీధి నల్లాలు ఉంటే ప్రత్యామ్నాయంగా పరిష్కారానికి అవకాశం ఉండేదని ప్రజలు పేర్కొంటున్నారు.

బీఆర్ఎస్ నాయకుల సంబరాలు

రాజేంద్రనగర్: ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు కావడంతో బీఆర్ఎస్ శ్రేణులు సంతోషంలో మునిగిపోయారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఉప్పర్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు తినిపించుకొని నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఏ ఆధారాలు చూపకుండా దౌర్జన్యంగా 166 రోజులు జైల్లో పెట్టారని, చివరికి న్యాయమే గెలిచిందని బీఆర్ఎస్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ కవితకు బెయిల్ ఇవ్వడం పట్ల సుప్రీంకోర్టుకు బీఆర్ఎస్ పార్టీ ధన్యవాదాలు తెలిపారు.



సంబరాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

షియా కమిటీ ఆధ్వర్యంలో జులూస్

అత్తాపూర్: షియా కమిటీ ఆధ్వర్యంలో అరెబియాన్ జులూస్ ఎంఎం పహాడి దర్గా నుంచి కయింనగర్ వరకు కొనసాగింది. సయ్యద్ సర్దార్ రిజ్వాన్ ఆధ్వర్యంలో కొనసాగిన ఈ ర్యాలీలో ఎమ్మెల్సీ అఫండి, రాజేంద్రనగర్ ఏసీబీ శ్రీనివాస్, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకటరామిరెడ్డి, సీనియర్ పాత్రికేయులు మహమ్మద్ మోసిన్, స్థానిక నాయలు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేత



మండల విద్యాధికారికి అందజేసిన వినతి పత్రం

శంషాబాద్: హరితమిత్ర, రాష్ట్ర ఉత్తమ పాఠశాల, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు వంటి అనేక అవార్డులు సాధించిన పట్టణంలోని హుడా కాలనీ ప్రాథమిక పాఠశాలను కేవలం నెలన్నర రోజుల్లో అధ్వానంగా మార్చారని పాఠశాల గౌరవ అధ్యక్షుడు, విశ్రాంత సైనికుడు, న్యూ హుడా కాలనీ అధ్యక్షుడు వక్కంటి జనార్ధన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండల విద్యాధికారి రాంరెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బదిలీల్లో భాగంగా హుడా కాలనీ పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయురాలు పాఠశాలను అత్యంత దారుణంగా మార్చేశారన్నారు. విద్యార్థులతో పారిశుద్ధ్య పనులు చేయించడంతో పాటు నీళ్లు మోయించడం వంటి పనులు చేయిస్తోందన్నారు. పోషకాలు లేని ఆహారం అందిస్తున్నారన్నారు. పాఠశాల భవన నిర్మాణం కోసం పన్నెండేళ్ల కిందటనే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తాను అహర్నిషలు తిరిగిన సంగతిని ఆయన గుర్తు చేశారు. ఉపాధ్యాయురాలి తీరుతో విద్యార్థులు పూర్తిగా తగ్గిపోతున్నారని, ఈ విషయమై మండల, జిల్లా స్థాయి విద్యాధికారులు వెంటనే తనిఖీలు చేయించి తగు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్

అత్తాపూర్: డివిజన్ హుడా కాలనీలో సీసీ రోడ్డు అభివృద్ధి పనులను మంగళవారం బస్తీ ప్రజలతో కలిసి కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్ రూ.5లక్షల వ్యయంతో పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనులలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాలని సూచించారు. అత్తాపూర్ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, సమస్య ఎలాంటిదైనా అధికారులతో చర్చించి పరిశీలించి, పూర్తి చేయిస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వనం శ్రీరామ్‌రెడ్డి, బీజేపీ నాయకులు సిద్దేశ్వర్, వెంకటేష్, హనుమంత్ రావు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం జరిగితే తప్పా స్పందించరా..?



ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలు

రాజేంద్రనగర్: శివరాంపల్లి ప్రశాంత్ కాలనీలో విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరి ప్రమాదాలను పొంచి ఉన్నప్పటికి విద్యుత్‌శాఖ, జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత ఐదు రోజుల క్రితం ఈ స్తంభాలకు ఆనుకొని ఉన్న ఎండిన చెట్టును డీసీఎం ఢీకొనడంతో ఆ చెట్టు పూర్తిగా స్తంభంకు ఉన్న తీగలపై పడటంతో మరింత ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో నిత్యం వాహనాలు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తుండటంతో ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురైతున్నారు. పాడైన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని ఐక్యత వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరు చూస్తుంటే ప్రమాదం జరిగితే తప్పా.. పట్టించుకోం అన్నట్లుగా అనిపిస్తుందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అసలే వర్షాకాలం కావడంతో ఏ క్షణం ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తమ నిర్లక్ష్యాన్ని వీడి ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

తప్పిన పెను ప్రమాదం



రాజేంద్రనగర్: బుద్వేల్ ప్రధాన రహదారి ఇరువైపులా ఏపుగా పెరిగిన భారీ వృక్షాలు ఉన్నాయి. మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా పెద్ద శబ్దంతో ఓ చెట్టు కొమ్మ విరిగి రోడ్డుపై పడింది. ఈ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రతిరోజు ఈ రహదారి గుండా వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రమాద సమయంలో ఎలాంటి వాహనాలు, పాదచారులు ఈ దారి గుండా వెళ్లకపోవడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదని.. స్థానికులు జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవి కుమార్‌కు ఫోన్ ద్వారా తెలపడంతో ఆయన వెంటనే స్పందించారు. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ డిజాస్టర్ టీమ్‌ను సంఘటనా స్థలానికి పంపించారు. సిబ్బంది విరిగిపడ్డ చెట్టు కొమ్మలను పక్కకు తీసి రాకపోకలను పునరుద్దరించారు.

నియామక పత్రాల అందజేత



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ప్రాంతానికి చెందిన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.సత్యనారాయణ ముదిరాజ్‌ను జగిత్యాల జిల్లా ఇన్‌చార్జిగా నియమించారు. ఈ మేరకు మంగళవారం ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ సత్యనారాయణ ముదిరాజ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ ముదిరాజ్ విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో పార్టీ రోజు రోజుకు బలమైన శక్తిగా ఎదుగుతుందని, గత శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ సత్తా చాటిందని అన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో సైతం అత్యధిక స్థానాలను గెలుచుకునేందుకు పార్టీ ఒక ప్రణాళికతో ముందుకు వెళ్తుందన్నారు. తనపై ఎంతో నమ్మకంతో జగిత్యాల జిల్లా ఇన్‌చార్జిగా నియమించినందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఏఐ డిజిటల్ అభ్యాసాన్ని మెరుగుపరుస్తుంది

రాయదుర్గం: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ డిజిటల్ అభ్యాసాన్ని మెరుగుపరుస్తుందని హాంకాంగ్‌లోని ది ఎడ్యుకేషన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ జుసియోంగ్‌లీ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మనూలో 'ఇన్స్పిరేషన్ డిజిటల్ లెర్నింగ్ ఆఫ్ ఇంగ్లిష్ (ఐడీఎల్ఈ), జనరేటివ్ ఏఐ ఇన్ లాంగ్వేజ్ టీచింగ్ అండ్ రీసెర్చ్' అనే అంశంపై నిర్వహించే అంతర్జాతీయ సమావేశంలో భాగంగా 'మనూ' ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌సీయూ, ఓక్సన్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఈనెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు అంతర్జాతీయ సదస్సును 3 రోజులపాటు నిర్వహించనున్నారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఆంగ్లభాషా బోధన, పరిశోధనలో ఏఐ సాధనాలకు పెరుగుతున్న ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమాన్ని సీనియర్ ప్రొఫెసర్ పంచానన్ మొహంతి ప్రారంభించగా, రిసోర్స్‌పర్సన్లు డాక్టర్, ప్రమోద్ సాహ్, డాక్టర్ జుసియోంగ్‌లీ వ్యవహరించారు. ఈ సమావేశంలో మనూ ఓఎస్‌డీ-1 ప్రొఫెసర్ షగుఫ్తాషాహీన్, మనూ ఆజాద్ చైర్ ప్రొఫెసర్ ఇంతియాజ్, రీసెర్చ్ స్కాలర్లు టీనా థామస్, ఎన్‌కే నజ్మా ప్రసంగించారు.

కవితకు బెయిల్ పట్ల హర్షం



కవితకు అనుకూలంగా నినాదాలు చేస్తున్న నాయకులు



నార్సింగిలో అంబేద్కర్‌కు నివాళులు అర్పించి స్వీట్లు పంచుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ రావటంతో ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు చేసుకున్నారు. సుప్రీం కోర్టు మంగళవారం ఆమెకు బెయిల్ మంజూరు చేయటంతో మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో పార్టీ నాయకులు స్వీట్లు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధన్‌రాజ్, సీనియర్ నాయకుడు సీతారాం, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, సాయికుమార్‌లు మాట్లాడుతూ.. ఎలాంటి ఆధారాలు లేకుండా కేసు పెట్టి ఐదు నెలలుగా జైలులో ఉంచినప్పటికీ ఎలాంటి భయం లేకుండా కవిత కేసును ఎదుర్కొన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నవీన్‌కుమార్, నాయకులు లక్ష్మయ్య, లక్ష్మన్‌రావు, రాజేంద్రప్రసాద్, విజయలక్ష్మి, శ్రీకాంత్, కిరణ్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, ఆరిఫ్, శ్రీధర్ గుప్తా, స్వామి, జైరామ్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన గోకులాష్టమి వేడుకలు



ఉత్సవాలలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్, మేయర్ తదితరులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవులలో శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం ప్రారంభమైన గోకులాష్టమి వేడుకలు మంగళవారంతో ముగిశాయి. ఉత్సవాలలో భాగంగా సోమవారం సుదర్శనహోమము, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. మంగళవారం ఉదయం 1008 కలశాలతో సహస్త్ర కలశాభిషేకము, స్వామి వారి ఊంజల్‌సేవ, ఊరేగింపు, ఉట్టు కొట్టడం కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవాలలో మంగళవారం నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ లంకల పాపిరెడ్డి, కౌన్సిలర్ ఉషారాణి, నాయకులు కిరణ్‌కుమార్, వినోద్‌కుమార్, సాయిరాం, నిర్వాహకులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాల సందర్భంగా అధికారుల సమావేశం



సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్, తదితర అధికారులు

రాజేంద్రనగర్: గణేష్ ఉత్సవాల నేపథ్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి గణేష్ ఉత్సవ సమితి సభ్యులతో పాటు పోలీసు, ట్రాఫిక్, జలమండలి, ఇరిగేషన్, విద్యుత్, రెవెన్యూ, ఇంజనీరింగ్, పారిశుద్ధ్యం తదితర విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. గత సంవత్సరం రాజేంద్రనగర్‌లోని పత్తికుంట చెరువులో దాదాపు 9 వేల విగ్రహాలను నిమజ్జనం చేశారు. 11వ రోజు వరకు ఈ విగ్రహాల నిమజ్జన కార్యక్రమం నిర్విరామంగా సాగింది. ఈ నేపథ్యంలో ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్, ఉప కమిషనర్ రవి కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి



ఎమ్మెల్యే గాంధీని కలిసిన డీఎంహెచ్ఓ సుధాకర్ లాల్, డాక్టర్లు విజయపూర్ణిమ, అన్నపూర్ణ

గచ్చిబౌలి: ఆరోగ్య శేరిలింగంపల్లిగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని వైద్యాధికారులకు ఎమ్మెల్యే గాంధీ సూచించారు. శేరిలింగంపల్లి జోన్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధాకర్‌లాల్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయపూర్ణిమ, శేరిలింగంపల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, ఇతర డాక్టర్లు ఎమ్మెల్యే గాంధీని కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. కొండాపూర్ ఏరియా ఆస్పత్రి, పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. వైద్యసేవలను నిరంతరం పర్యవేక్షించి ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు. ఆస్పత్రులలో మౌలిక వసతుల కల్పనకు చొరవ తీసుకుంటామన్నారు. వర్షాకాలం డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, వ్యాధులు ప్రబల కుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. మెరుగైన వైద్యసేవలను అందించాలని చెప్పారు. కార్యక్రమంలో పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.